ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
బుధవారం 26 నవంబరు 2025 www.prajaswaramdailly.com 5 pm

# ఐ-బొమ్మ రవికి 14 రోజుల రిమాండ్




హైదరాబాద్,ప్రజాస్వరం : ఐ-బొమ్మ రవిని కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. రవికి నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇమంది రవిపై ఇప్పటికే 5 కేసులను హైదరాబాద్ క్రైమ్ పోలీసులు నమోదు చేశారు. రెండు కేసుల్లో రవికి కోర్టు రిమాండ్ విధించింది.

# బీఆర్ఎస్ నేతలపై మంత్రి సీతక్క ఫైర్

## చీరలపై దుష్ప్రచారం తగదు



హైదరాబాద్,ప్రజాస్వరం ఇందిరమ్మ చీరలపై బీఆర్ఎస్ లీడర్‌ల దుష్ప్రచారం తగదని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆడబిడ్డలు ఎంపిక చేసిన డిజైన్లలోనే చీరల పంపిణీ చేశామన్నారు. చీరల కలర్ బాగాలేదని బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం వారి వక్రబుద్ధికి నిదర్శనమన్నారు. ఆడవాళ్లు ఎదుగుతుంటే కేటీఆర్ హరీష్ లు ఓర్వలేరన్నారు.

## సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో

# ప్రభుత్వం ద్రోహం చేస్తోంది

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ప్రజాపోరాటాలతో కాంగ్రెస్ కు బుద్ధి చెబుతామని హెచ్చరిక**



(హైదరాబాద్, ప్రజాస్వరం )
సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. 129 మంది అన్ఫిట్ కోసం పెట్టుకుంటే కేవలం 23 మందికే ఆమోదం తెలిపారన్నారు. కార్మికులకు ద్రోహం చేసే నైజాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టుకుందన్నారు.
తెలంగాణ జాగృతి తరపున ఎట్టి పరిస్థితుల్లో దీనికి మేము అంగీకరించం అని అన్నారు. ప్రజా పోరాటాల ద్వారా ప్రభుత్వానికి బుద్ధి చెప్తాం అని కవిత హెచ్చరించారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ మృతిచెందినట్లు పుకార్లు



ఇస్లామాబాద్ : జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ ను హతమార్చినట్లు సోషల్ మీడియాలో ఒక్కసారిగా వార్తలు తెరపైకి వచ్చాయి. తమ 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించి బలూచిస్థాన్ విదేశాంగ శాఖ పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. మరోవైపు ఆయన అనారోగ్యంతోనూ మరణించి ఉండొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి. కానీ, ఇప్పటి వరకు వీటిని ధ్రువీకరించేలా అధికారికంగా ఒక్క ఆధారమూ బయటకు రాలేదు. ఈ మేరకు మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసనలు కూడా చేపట్టినట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇమ్రాన్ సోదరీమణులు మంగళవారం రాత్రి జైలు దగ్గరకు చేరుకున్నట్లు సమాచారం. వెంటనే తమ సోదరుణ్ని కలిసేందుకు అనుమతించాలని డిమాండ్ చేసినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కానీ, పోలీసులు అందుకు అనుమతించలేదని తెలుస్తోంది. పైగా వారిపై తీవ్రంగా దాడి కూడా చేసినట్లు సమాచారం.



# జవహర్ నగర్ లో కూల్చివేతలు

జవహర్ నగర్, నవంబర్ 26, ప్రజాస్వరం:జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రభుత్వ భూమిలో పలు అక్రమ కట్టడాలను బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఆర్ఐ రమేష్ నేతృత్వంలో పోలీస్ బందోబస్తు మధ్య కార్పొరేషన్ పరిధిలోని సర్వేనెంబర్ 376, 377, 293, 202,203/1, 710, 421, 812 నిర్మించిన కట్టడాలను జెసిపి ల సహాయంతో కూల్చివేశారు.
అన్యాయంగా కూల్చివేస్తున్నారు: బాధితులు ఆవేదన ప్రభుత్వం, అధికారులు కావాలనే నిరుపేదలపై ప్రతాపం చూపిస్తున్నారని ఓపక్క కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇస్తుంటే ఇటు అధికారులు మాత్రం నిలువ నీడ లేకుండా కూల్చివేతలు చేపట్టడం ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# సౌత్ ఏషియా బిగ్గెస్ట్ పౌల్ట్రీ ఎక్స్ పో - 2025 ప్రారంభం

**హాజరైన మంత్రి పొన్నం**

హైదరాబాద్,ప్రజాస్వరం : హైదరాబాద్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో సౌత్ ఏషియా బిగ్గెస్ట్ పౌల్ట్రీ ఎక్స్ పో - 2025 కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. నేటి నుండి మూడు రోజుల పాటు జరగనున్న కార్యక్రమం నిర్వహించనున్నారు.
ఇందులో పౌల్ట్రీ రంగంలో రైతులకు ఉపయోగపడే అధునాతన టెక్నాలజీని ఉపయోగించి తక్కువ సమయంలో శ్రమ లేకుండా వాడే దాన మిషన్లు , ఎగ్ కలెక్షన్ మిషన్లు తదితర యంత్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.

## రెండో టెస్టులో

# భారత్ ఘోర ఓటమి

**140 పరుగులకు కుప్పకూలిన భారత్**

**408 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఘన విజయం**

**2–0 తేడాతో సిరీస్ సఫారీల కైవసం**



స్పోర్ట్స్ : దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్టులో భారత్ ఘోర ఓటమి పాలైంది. గువాహటి వేదికగా జరిగిన రెండో టెస్టు మ్యాచ్ లో దక్షిణాఫ్రికా భారత్ ముందు 549 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టార్గెట్ ను ఛేదించే క్రమంలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా 140 పరుగులకే ఆలౌటైంది. భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా చేసిన 54 పరుగులే అత్యధికం. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేయడంతో 140 పరుగుల వద్ద భారత్ కుప్పకూలింది. దీంతో 408 పరుగుల భారీ తేడాతో దక్షిణాఫ్రికా జట్టు విజయం సాధించింది.ఈ విజయంతో 2–0 తేడాతో టెస్ట్ సిరీస్ ను కైవసం చేసుకుంది. దక్షిణాఫ్రికా చేతిలో భారత్ వైట్ వాష్ కు గురైంది. దక్షిణాఫ్రికా బౌలర్లలో హార్మర్ 6 వికెట్లు, కేశవ్ మహారాజ్ 2 వికెట్లు పడగొట్టారు. ముత్తుస్వామి, మార్కో యాన్సన్ చెరో వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్ లో దక్షిణాఫ్రికా 489 రన్స్ చేయగా, భారత్ 201 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్ లో దక్షిణాఫ్రికా 260/5 వద్ద డిక్లేర్ చేసింది.



# హాంకాంగ్లో భారీ అగ్నిప్రమాదం

**నలుగురు మృతి**

హాంకాంగ్ : హాంకాంగ్ లోని ఓ నివాస సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆ దుర్ఘటనలో నలుగురు మృతి చెందారని, వందలాది మంది చిక్కుకుపోయారు. థాయ్ పో జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో 2 వేల అపార్ట్ మెంట్లు ఉన్నాయి. హాంకాంగ్ స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.51 గంటల సమయంలో ఈ ఘటనపై సమాచారం అందిందని అగ్నిమాపక విభాగం వెల్లడించింది.



# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

**మెదక్ నవంబర్ 26 (ప్రజా స్వరం)** రాజ్యాంగ దినోత్సవాన్ని మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ అపార కృషిని స్మరించుకుంటూ, కార్యక్రమంలో భాగంగా ఎస్పీ రాజ్యాంగ పీఠికను సిబ్బందితో కలసి పఠనం చేశారు. భారత రాజ్యాంగం ప్రపంచంలో అత్యంత బలమైన ప్రజాస్వామ్య రాజ్యాంగాలలో ఒకటిగా నిలిచిందని, అందులో ప్రతిబింబించిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాత్రం వంటి విలువలు ప్రతి పౌరుడు, ముఖ్యంగా పోలీసు సిబ్బంది నిబద్ధంగా పాటించాల్సినవని తెలిపారు. ప్రజల హక్కులను రక్షిస్తూ, చట్టాన్ని సమానంగా అమలు చేయడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని మరింత పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్ర బోస్, రంగా నాయక్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, శైలేందర్, రామకృష్ణ, ఏఓ మణి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

